Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 357 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) శనివారం, 14 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## మాజీ సీఎం విజయ్ రూపానీతో మోదీ జ్ఞాపకాలు, కుటుంబానికి పరామర్శ



**ఇంటర్నెట్ డెస్క్:** ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ మాజీ సీఎం విజయ్‌భాయ్ రూపానీ కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. నిన్న జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అసువులు బాసిన వాళ్లలో విజయ్ రూపానీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. ప్రమాదం నేపథ్యంలో ఇవాళ గుజరాత్ వెళ్లిన ప్రధాని మోదీ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల యోగక్షేమాలు అడిగారు. అనంతరం విజయ్ రూపానీ ఇంటికివెళ్లి కుటుంబ సభ్యులతో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పీఎం మోదీ.. విజయ్‌భాయ్ మన మధ్య లేరనేది ఊహించలేనిదన్నారు. తనకు దశాబ్దాలుగా ఆయన తెలుసన్న మోదీ.. భుజం భుజం కలిపి.. తామిద్దరం కలిసి పనిచేశామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అత్యంత సవాలుతో కూడిన సమయాల్లో కూడా విజయ్‌భాయ్ వినయ పూర్వకంగా కష్టపడి పనిచేసేవారని మోదీ అన్నారు. పార్టీ సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి ఉండేవారని, ఉన్నత స్థాయికి ఎదిగి, వివిధ బాధ్యతలను నిర్వహించి, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంతో శ్రద్ధాశక్తులతో సేవలందించారని మోదీ కీర్తించారు. రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అయినా, రాజ్యసభ ఎంపీగా అయినా, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా అయినా, క్యాబినెట్ మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా అయినా, ఆయనకు కేటాయించిన ప్రతి బాధ్యతలోనూ ఆయన ఎల్లప్పుడూ ఒక ప్రత్యేకమైన ప్రతిభను కనబరిచారని మోదీ చెప్పారు. విజయ్‌భాయ్ గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని, గుజరాత్ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆయన అనేక చర్యలు తీసుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. వాటిలో 'ఈజ్ ఆఫ్ లివింగ్' ముఖ్యమైనదని చెప్పారు. ఆయనతో జరిగిన సమావేశాలు, చర్చలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని మోదీ బాధాతప్త హృదయంతో అన్నారు. ఓం శాంతి.. అంటూ మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య

**విశాఖ, (రాజధాని వార్తలు):** నగరంలోని రెడ్డి కంచరపాలెంలో దారుణం చోటు చేసుకుంది. గోపీనాథ్ అనే వ్యక్తి తన భార్యను హతమార్చి అనంతరం అతను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. గత అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గోపీనాథ్ భార్య తలపై ఇనుప డంబుల్‌తో గట్టిగా కొట్టి హతమార్చాడు. కుటుంబ కలహాల కారణంగా భార్యను హతమార్చినట్టు సమాచారం. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

**కేసు వెనక్కి తీసుకోమంటూ..**

గోపీనాథ్‌పై పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును వెనక్కి తీసుకోవాలని భార్యను ఒత్తిడి చేశాడు. కేసు వెనక్కి తీసుకునేందుకు ఆమె తిరస్కరించింది. ఈ విషయంలో గత అర్ధరాత్రి 2:30 గంటల వరకు భార్య వెంకటలక్ష్మితో గోపీనాథ్ గొడవపడ్డాడు. ఎంతకూ ఆమె కేసు వెనక్కి తీసుకోనని మొండికేయడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన భర్త ఇంట్లో ఉన్న డంబుల్‌తో ఆమె తలపై కొట్టి చంపి.. మధ్య గదిలో గడియ పెట్టుకొని గోపీనాథ్ కూడా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కంచరపాలెం పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**డబ్బుల విషయంలో భార్య భర్తల మధ్య గొడవ..**

విశాఖలోని రెడ్డి కంచరపాలెంలో గోపీనాథ్ (42), వెంకటలక్ష్మి (39) భార్యా భర్తలు నివాసముంటున్నారు. గోపీనాథ్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే తెచ్చిన డబ్బులను




కుటుంబ అవసరాలకు ఇవ్వకుండా, చెడు అలవాట్లకు ఖర్చు చేస్తుండడంతో.. డబ్బుల విషయంలో భార్య వెంకటలక్ష్మి భర్తతో గొడవ పడేది. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. దీంతో వెంకటలక్ష్మి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేసింది. తన భర్త తనను వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని.. తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ విషయం తెలుసుకున్న భర్త.. భార్యతో గొడవపడేవాడు. నిన్న అర్ధరాత్రి ఇద్దరి మధ్య గొడవ మరింత తీవ్రమైంది. తనపై పోలీస్ స్టేషన్‌లో పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. అందుకు ఆమె తిరస్కరించింది. దీంతో గోపీనాథ్ తీవ్ర ఆగ్రహానికి గురై.. ఇంట్లో ఉన్న డంబుల్‌తో ఆమె తలపై కొట్టడంతో ఆమె చనిపోయింది. ఆ వెంటనే గోపీనాథ్ కూడా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బోయింగ్ 787-8 విమానాల నిలిపివేత.. పరిశీలనలో కేంద్రం



**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భద్రతా సమీక్ష జరిపేంత వరకూ బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాలను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందుకోసం భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్టు తెలిపాయి. అహ్మదాబాద్ దుర్ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నందున అది పూర్తి కాగానే 787-8 విమాన సేవలు కొనసాగించాలా వద్దా అనే దానిపై కేంద్రం ఒక నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నాయి. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ 787-8 విమానం కుప్పకూలిన ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికుల్లో 241 మంది మృతి చెందగా, ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటలకు టేకాఫ్ అయిన వెంటనే అనూహ్యంగా బీజే మెడికల్ కాలేజీ డాక్టర్ల రెజిడెన్షియల్ క్వార్టర్డ్‌లోకి విమానం దూసుకుపోయింది. ఆ తర్వాత మంటల్లో చిక్కుకుంది. ఇంజన్లలో ముందుకు లాగే శక్తి కోల్పోవడం, పక్షి ఢీకొనడం వంటివి విమానం కూలిపోవడానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థలు కలిగి ఉండి ఇంధనాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకుంటుందనే పేరుంది. 2011 అక్టోబర్‌లో ఈ డ్రైమ్‌లైనర్ సేవలు మొదలైనప్పటి నుంచి గత 14 ఏళ్లలో 100 కోట్ల మంది ప్రయాణికులను సురక్షితంగా చేరవేసిందని, నేవియేషన్ చరిత్రలో ఏ డ్రీమ్‌లైనర్ కూడా ఇంత వేగంగా రికార్డు సాధించలేదని బోయింగ్ వెబ్‌సైట్ చెబుతోంది. ఈ మోడల్ ప్రవేశపెట్టినప్పటి నుంచి 2,500 వరకూ 787-8ల అమ్మకాలను బోయింంగ్ జరుపగా, ఎయిర్ ఇండియా 47 విమానాలకు కొనుగోలు చేసింది. కాగా, అహ్మదాబాద్‌లో విమానం కుప్పకూలిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశించినట్టు పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు తెలిపారు.

## తల్లుల ఖాతాల్లోకి నిధులు.. ఆనందంలో కుటుంబాలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా సూపర్ సిక్స్‌లో ప్రధానమైన తల్లికి వందనం హామీని అమలు చేసింది ప్రభుత్వం. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో తల్లికి వందనం నిధుల జమ ప్రారంభమైంది. తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. ఈరోజు సాయంత్రానికి సుమారు 54 లక్షల మంది విద్యార్థిని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమకానున్నాయి. ఒక్కొక్కరికీ 13 వేల రూపాయల చొప్పున జమ చేయనున్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం నిధులు ఇవ్వనున్నారు. ముగ్గురు పిల్లలు చదువుతుంటే 39 వేల రూపాయలు జమ అవుతుండటంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లు విరుస్తోంది. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలు చదువుకుంటుంటే వారికి 26 వేల రూపాయలు జమ అవుతున్నాయి. ఫోన్లకు బ్యాంక్‌ల నుంచి మెసేజ్‌లు వస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోంది కూటమి సర్కార్. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలను అమలు చేసింది. ఇప్పుడు తాజాగా సూపర్ సిక్స్ హామీల్లో అతి కీలకమైన తల్లివందనం పథకం కింద నిధులను తల్లుల ఖాతాల్లో జమ ప్రక్రియను మొదలుపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా తల్లులకు కానుకగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్నటి (గురువారం) మీడియా సమావేశంలో తెలియజేశారు. మంత్రి లోకేష్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు సీఎం. ఇందులో భాగంగా అధికారుల సమక్షంలో తల్లివందనం జీవోలను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అందజేశారు. అర్హులందరికీ తల్లివందనం నిధులు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 67,27,164 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తించనుంది. ఇందుకు అవసరమయ్యే రూ.8,745 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ రూ. 15 వేలల్లో తల్లుల ఖాతాల్లో రూ. 13 వేలను జమ చేసి.. మిగిలిన రూ.2 వేలను పాఠశాలల మెయింటనెన్స్ గ్రాంట్ కోసం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉండే ఖాతాకు మళ్లించనున్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో చేరే విద్యార్థులకూ పథకాన్ని అమలు చేయనుంది సర్కార్.

## కొమ్మినేనికి బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ అయి ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా ఉన్నారు. దీంతో ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టులో బెయిల్ కోసం కొమ్మినేని దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్కడ ఆయన బెయిల్ పిటీషన్ పెండింగ్‌లో ఉండగానే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ పీకే మిశ్రా ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ.. వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిస్తూ.. మరోసారి అమరావతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి సుప్రీం ధర్మాసనం సూచించింది. భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. కింది కోర్టు విధించిన షరతులకు లోబడే బెయిల్ మంజూరీ చేస్తున్నామని పేర్కొంది. విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం స్పష్టం చేసింది.

**కేసు వివరాలు...**

నవ్యాంధ్ర రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అని జగన్ చానల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన కేసులో యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల జగన్ చానల్లో యాంకర్ కొమ్మినేని నిర్వహించిన లైవ్ డిబేట్లో.. అమరావతి దేవతల రాజధాని కాదు... వేశ్యల రాజధాని అని కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కొమ్మినేని ఆయనను వారించకుండా చర్చను కొనసాగించారు. దీనిపై రాజధాని ప్రాంతం సహా రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకాయి. మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నా.. ఆ ఇద్దరు గానీ, సాక్షి యాజమాన్యం గానీ కనీసం క్షమాపణలు చెప్పకపోవడంతో వారు మండిపడుతున్నారు.

**కొమ్మినేని అరెస్టు ఇలా..**

ఈ క్రమంలో రాజధాని ప్రాంత దళిత జేఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యంపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతోపాటు పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం తుళ్లూరు పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీకి వెళ్లి కొమ్మినేని నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లో హాజరుపరిచి.. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై సోమవారం రాత్రికి విజయవాడ తీసుకొచ్చారు. తొలుత




రాజధానిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు గానీ.. లేదంటే గుంటూరు గానీ తీసుకురావాలని భావించారు. అయితే ఈ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్న మహిళలు ప్రతిఘటించవచ్చని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో పోలీసులు విజయవాడలోనే ఆయన్ను రహస్య ప్రాంతంలో ఉంచారు. రాత్రి పొద్దుపోయాక నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టులో కొమ్మినేని హాజరుపర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

**జర్నలిస్టు కృష్ణంరాజు అరెస్టు...**

జగన్ చానల్ డిబేట్‌లో అమరావతి ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరుస్తూ దారుణ వ్యాఖ్యలు చేసిన కేసులో పరారీలో ఉన్న ఏ1, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కృష్ణంరాజు ఫార్చునర్ వాహనంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వస్తున్నట్టు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారులు విజయనగరం పోలీసులతో పాటు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీని అప్రమత్తం చేశారు. కృష్ణంరాజు ప్రయాణిస్తున్న కారు విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి దాటి విశాఖపట్నం జిల్లా భీమిలి మండల పరిధిలోని అమనాం జంక్షన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ మాటువేసిన భీమిలి పోలీసులు ఆ వాహనాన్ని ఆపి, అందులో ఉన్న కృష్ణంరాజుతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తుళ్లూరు పోలీసులకు అప్పగించారు. దీంతో కృష్ణంరాజును రోడ్డుమార్గంలో బుధవారం రాత్రికి నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాక్షి టీవీ చానల్‌లో ఈ నెల 6న నిర్వహించిన డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించిన విషయం తెలిసిందే.

## రేపు పోలవరానికి సీడబ్ల్యూసీ బృందం



**అమరావతి, (రాజధాని వార్తలు):** పోలవరం ప్రాజెక్టు పనులపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. డయాఫ్రంవాల్, ప్రధాన డ్యాం ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం పనుల నాణ్యాతా ప్రమాణాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు కేంద్ర జల సంఘం సభ్యుడు యోగేందర్ పైతాంకర్, చీఫ్ ఇంజనీర్ హెచ్‌ఎస్ సెంగర్ శుక్రవారం రాజమహేంద్రవరానికి రానున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో జరుగుతున్న పనులను వారు శనివారం సమీక్షిస్తారు. అదేరోజు రాత్రికి రాజమహేంద్రవరంలో బస చేసి అధికారులతో సమావేశమవుతారు. ఆదివారం తిరిగి ఢిల్లీకి పయనమవుతారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో అల్ట్రా స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట, పెద్దాపురం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిల్లో అల్ట్రా స్కాన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని శ్రీ శివశంకర దుప్పట్ల వర్తక సంఘం అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో శ్రీ శివశంకర దుప్పట్ల వర్తక సంఘం 41వ మహాసభ భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దాపురం నియోజక వర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా 24 గంటలు మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయని, రోగులకు అవసరమైన అల్ట్రా స్కాన్ సెంటర్ లేకపోవడంతో కాకినాడ వెళ్ళవలసి వస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలను దృష్టిలో ఉంచుకొని అల్ట్రా స్కాన్ సెంటర్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలని కోరారు. సామర్లకోట పట్టణంలో గత 40 ఏళ్లగా అనేక ప్రభుత్వాలు మారిన సమస్య మాత్రం తీరలేదన్నారు. సామర్లకోట ఫిల్టర్ బెడ్ సామర్థ్యాన్ని పెంచి ప్రజలకు రక్షిత త్రాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్ రావు, సిఐటియు మండల అధ్యక్షులు బాలం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా దుప్పట్ల సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా కరణం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కరణం సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కత్తిరి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గుడ్ల నారాయణ రావు, కోశాధికారిగా పోతుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా పెంకే వెంకట రాజేష్, కరణం గోవిందరాజులు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో ఇంకా తుటిపాటి రాజు, తలరాపు నర్సరావు, సప్పా సత్తిబాబు పీఎస్ నాయుడు, బాలం సత్తిబాబు, ఇదిబిల్లి ప్రసాద్, పారినాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యలో రాణించాలి...ఆర్బీ కొత్తూరు పాఠశాలలో జెసి పరిశీలన





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం పరుచుకుంటూ అన్ని విషయాల్లో రాణించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. పెద్దాపురం మండలం ఆర్బి కొత్తూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం సందర్శించి పరిశీలించారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో తెరిచిన మొదటి జెసి రాహుల్ మీనా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయ సిబ్బంది హాజరు, విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం, సిబ్బంది విద్యార్థులు హాజరు రిజిస్టర్లు ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విషయంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మరింత అధికంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, మరుగుదొడ్ల సదుపాయం, త్రాగునీరు, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత వంటి విషయాలపై పరిశీలన జరిపి ప్రధాన ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారని విషయంపై ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ సం దర్భంగా పదో తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీలను ఆయన అందజేశారు. పాఠశాలకు విచ్చే సిన జెసికి హెచ్ఎం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛానందించి గౌరవిం చారు. ఈ పరిశీలనలో మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం - అంగన్వాడీ పిలుస్తోంది ర్యాలీలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సామర్లకోట బ్రౌన్ పేట, అయోధ్యరాపురం సెక్టార్ల పరిధిలో "అంగన్వాడీ పిలుస్తోంది" కార్యక్రమాలు గురువారం ఘనంగా చేపట్టారు. సెక్టర్ సూపర్వైజర్లు ఎండి సుల్తానా బీబీ, ఉమాదేవిల ఆధ్వర్యంలో బ్రౌన్ పేట, అయోధ్యరాపురం సెక్టర్ల పరిధిలో తొలుత అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అంగన్వాడీలు ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడి ప్రీ స్కూల్లో చేర్పించాలని, అంగన్వాడీలో ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న ఐదేళ్లు పైబడిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బలుసుల పేటలోని నూతన సామర్లకోట ప్రాజెక్టు కార్యాలయంలో చిన్నారులకు సామూహిక అక్షరా




భ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ పేట, అయోధ్యరాంపురం సెక్టర్ల పరిధిలోని అందరు అంగన్వాడీలు, చిన్నారులు, తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం కృషి

## - మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్ష మేరకు పని చేస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కృషి ఎనలేనిదని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎసీవీ నాయుడు అన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని రాత్రింబవళ్లు కష్టపడి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబును అభినందించాల్సిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆయన అనుచరులు అర్థరహిత విమర్శలతో ప్రజలు మరింత చీ కొట్టించుకునే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని జగన్ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎస్సివి నాయుడు కోరారు. అమరావతి మహిళలను అవమానపరిస్తే రాష్ట్రంలోని మహిళలందరినీ అవమానపరిచినట్లేనని అనేది వైసిపి నాయకులు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వము వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా శ్రీ కాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సివి నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి జనసేన బీజేపీ ఉమ్మడిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అక్షర క్రమంలోనే కాకుండా ఆర్థికంగాను, అభివృద్ధి పరంగాను అగ్రగామిగా తీర్చిదిద్దడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అమ్మకు వందనం సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సులు పథకాన్ని అమలు చేయనున్నారని, ఈనెల 20వ తేదీన రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయనున్నారని, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు రాత్రింబవళ్లు కష్టపడి అమరావతి రాజధాని పునర్నిర్మాణం చేస్తున్నారని మరో 10 ఏళ్లకు అమరావతి రాజధాని ఆదాయం రాష్ట్రానికి ప్రధాన ఆదాయ



వనరుగా మారుతుందని చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఏమిటో మనకు భవిష్యత్తు తరానికి అర్థమవుతుందన్నారు. ఎంతో ముందుచూపుతో 20 47 విజన్‌తో ముందుకు వెళ్తున్న చంద్రబాబు నాయుడును అభినందించాల్సిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వైసీపీ నాయకులు అర్థరహిత విమర్శలతో ప్రజల్లో మరింత చులకన అవుతున్నారనీ, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు. అమరావతి మహిళలు అవమానిస్తే రాష్ట్రంలోని మహిళలను అవమానించినట్లేనని బాధ్యతా యుతమైన ప్రజాప్రతినిధులుగా స్త్రీలను గౌరవిస్తూ సమాజ అభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం అందిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తు ముఖ్య మంత్రి యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అటు పార్టీ ఇటు ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం అయి ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ ముందుకు పోతుందని ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ ప్రజలకు మేలు చేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు సత్రవాడ ప్రవీణ్ కుమార్, ప్రకాష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, ఈర్ల కిషోర్, భాస్కర్ నాయుడు, మాజీ ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ గాలి బాలాజీ నాయుడు అరు నాయుడు ఢిల్లీ ప్రతాప్ సుదర్శన్ నాయుడు చందు తదితరులు పాల్గొన్నారు.

# పది గంటల పని విధానంపై కార్మికుల నిరసన




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సిఐటియూ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పరిశ్రమలు, ప్రైవేటు రంగాల్లో నేటికీ పది గంటల పని విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. తక్షణమే దానిని ఉపసంహరించు కోవాలని ఈ సందర్భంగా సిఐటియూ మండల కార్యదర్శి డి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేని ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక మహిళలతో రాత్రులు పనిచేయించడాన్ని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు కేవలం జనరల్ షిఫ్టులు మాత్రమే కేటాయించాలని క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మహిళా కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సిఎంగా సంవత్సరం పూర్తి...ఘనంగా కరపలో టిడిపి వేడుకలు





**కరప, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కరప మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో పార్టీ నాయకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ గత ఏడాది కాలంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి మార్గంలో వేగంగా ముందుకెళ్తోందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలుతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ఈ వేడుకల్లో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కూటమి సర్కారు పనితీరు భేష్ : ఎమ్మెల్యే దామచర్ల

## - కూటమి నేతలు నిశ్శబ్ద పాలనను అందిస్తున్నారన్న మాగుంట





**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఒంగోలు నగరంలో గురువారం ఉదయం విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగినది. ముందుగా రాజధాని సెంటర్ నందు కేక్ చేసి శుభాకాంక్షలు తెలిపిన తదుపరి ర్యాలీగా అద్దంకి బస్ స్టాండ్ వరకు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం నందు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ గత ఐదేళ్ల అంధకారాన్ని తొలగించి, ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో కూటమి అధికారంలోకి వచ్చిందని, ఈ ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశంలో రాష్ట్ర అభివృద్ధికి పునాదులు వేసారన్న ఎమ్మెల్యే. ఒంగోలు నియోజకవర్గంలో కూడా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది, నియోజకవర్గంలో రూ.130 కోట్ల అభివృద్ధి పనులు చేసామని ఎమ్మెల్యే జనార్ధన రావు వివరించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.వెయ్యి పెంచి రూ. 4వేలు అందిస్తున్నాం. వికలాంగులకు రూ. 3 వేలు పెంచి రూ. 6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి ప్రతినెలా రూ. 15వేలు అందిస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 203 అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం జరిగింది. ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం కూడా అమలు చేస్తున్నాం. దీపం పథకం ద్వారా ఇప్పటికే 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రజా ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచులకు అందించడం జరిగింది. గ్యాస్ పథకంలో సవరణలు తీసుకువచ్చి సదరు నగదును మహిళల బ్యాంక్ అకౌంట్లకే నేరుగా బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం హామీ నిలబెట్టుకుంటున్నాం. ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పాం. హామీ ఇచ్చిన విధంగా జీవో విడుదల చేయడం జరిగింది. ఈ రోజు నుంచి నగదు తల్లుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరుల సారథ్యంలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ, జనసేన నాయకులు కంది రవిశంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, మేయర్ సుజాత, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

# అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు... ఘనంగా సంవత్సర పాలన వేడుకలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వ అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ ప్రభుత్వం బురద చల్లే రాజకీయం చేస్తుందని కాకినాడ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పలు అన్నారు. గురువారం పెద్దాపురం పట్టణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తి అయిన సందర్భంగా కూటమి నాయకులు సంభరాలు జరుపుకున్నారు. తొలుత పెద్దాపురం తెదేపా కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిన రాజప్ప ఆధ్వర్యంలో కేకుకోసి వేడుకలు జరిపారు. అనంతరం ఆసుపత్రి వీధిలో ఉన్న కమిటీ హాల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికీ ఒక సంవత్సరం అయినా శుభ సందర్భంగా మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు అత్యం వీరభద్రరావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లకు సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక వైసీపీ పార్టీ బురదజల్లే రాజకీయం చేస్తుందన్నారు. మేము ఇస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు పక్కదారి పట్టించే విధంగా దుష్ప్రచారాలు చేస్తుందని మండపడ్డారు సంవత్సరకాలంలో పెద్దాపురం నియోజకవర్గంలో రూ. 100 కోట్లతో ఎమ్మెల్యే అభివృద్ధి చేశారని, గతంలో రూ. 1000 కోట్లతో పెద్దాపురం నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి మన కళ్ళకి ఇప్పటికీ కనిపిస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో గత వైసిపి పాలనలో ఒక్క అభివృద్ధి



పని కూడా ఎక్కడ చూడలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి అందరూ చూస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి సంవత్సరం పాలన విజయవంతంపై కేకులు కోసి వేడుక జరిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, 20వ వార్డు కౌన్సిలర్ ఓబిలి శెట్టి గుణేశ్వరరావు, జనసేన పార్టీ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, టిడిపి అధ్యక్షులు రంది సత్యనారాయణ, సామర్లకోట టౌన్ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, పెద్దాపురం జనసేన నాయకులు కటారి శ్రీను, లక్ష్మణ్ దివాకర్, అత్తేం రమేష్, అత్తేం రాజేష్, తూతిక రాజు, వంగలపూడి సతీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ ఇవ్వబోయే సర్‌ప్రైజ్ ఏంటి?



టాలీవుడ్ టాప్ స్టార్లలో ఒకడైన అల్లు అర్జున్ ఎప్పుడు ఏ సినిమాను ఓకే చేస్తాడో.. దేన్ని పక్కన పెడతాడో తెలియదు. అల్లు అర్జున్ చేయబోతున్నట్లు వార్తల్లోకి వచ్చి.. చాన్నాళ్ల పాటు చర్చల్లో ఉండి.. చివరికి క్యాన్సిల్ అయిపోయిన సినిమాలు ఎన్నో. ప్రేక్షకులు ఒక అంచనాతో ఉంటే.. దానికి భిన్నంగా సినిమాను ఎంచుకుని షాకిస్తుంటాడు బన్నీ. 'పుష్ప-2' తర్వాత త్రివిక్రమ్ సినిమాను మొదలుపెట్టబోతున్నట్లు కనిపించి.. చివరికి అట్లీ మూవీని సెట్స్ మీదికి తీసుకెళ్లి ఆశ్చర్యపరిచాడు బన్నీ. మరి దీని తర్వాత అయినా త్రివిక్రమ్‌తో జట్టు కడతాడా అంటే అదేమీ లేదని తేలిపోయింది. బన్నీతో చేయాల్సిన కుమారస్వామి కథను తారక్‌తో చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నాడు త్రివిక్రమ్. కాబట్టి బన్నీ వేరే దర్శకుడితోనే తర్వాతి సినిమా చేయబోతున్నాడన్నమాట. ఆ దర్శకుడు ఎవరన్నది సస్పెన్సుగా మారింది. లోకేష్ కనకరాజ్, సందీప్ రెడ్డి వంగా.. ఇలా చాలా పేర్లు ప్రచారంలో ఉన్నాయి కానీ.. బన్నీ ఆ అంచనాలకు భిన్నంగా అడుగులేయబోతున్నట్లు తెలుస్తోంది. బన్నీకి అత్యంత ఆప్తుడు, తన సినిమాల ఎంపికలో కీలక పాత్ర పోషించే బన్నీ వాసు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బన్నీ కొత్త సినిమా అందరికీ పెద్ద షాకివ్వబోతున్నట్లుగా సంకేతాలు ఇచ్చాడు. అసలు ఆ కలయికను ఎవరూ ఊహించరని, బన్నీ రూటే వేరు అని అనుకుంటారని బన్నీ వాసు తెలిపాడు. ఈ సర్ప్రైజ్ గురించి ఆల్రెడీ సోషల్ మీడియాలో ఊహాగానాలు మొదలైపోయాయి. బన్నీ ఈసారి ఓ మలయాళ దర్శకుడితో జట్టు కట్టబోతున్నాడని అంటున్నారు.

ఆ దర్శకుడు ఎవరో కాదు.. బాసిల్ జోసెఫ్ అట. ప్రస్తుతం నటుడిగా మంచి ఊపులో ఉన్న బాసిల్.. దర్శకుడు కూడా. మిన్నల్ మురళిలాంటి సూపర్ హిట్ చిత్రాన్ని అతను అందించాడు. అతను త్వరలో సూర్యతో ఓ సినిమా చేస్తాడని వార్తలు వచ్చాయి కానీ.. అది నిజం కాదని తెలుస్తోంది. అతను బన్నీతో జట్టు కట్టబోతున్నాడని.. అల్లు హీరోకు మలయాళంలో మాంచి క్రేజ్ ఉన్న దృష్ట్యా అక్కడి నేపథ్యంలో ఓ పాన్ ఇండియా సినిమా చేయడానికి స్క్రిప్టు రెడీ చేస్తున్నాడని.. ఈ ప్రాజెక్టు ఖరారవుతుందని చెబుతున్నారు. బన్నీ వాసు మాటల ప్రకారం ఇంకో నాలుగు నెలల్లో బన్నీ కొత్త సినిమా గురించి ప్రకటన రాబోతోంది. అది బాసిల్ దర్శకత్వంలో చేయబోయే ప్రాజెక్టు గురించే అని సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చలు నడుస్తున్నాయి.

# ఇండస్ట్రీలోని వారికి కూడా పర్సనల్ లైఫ్ ఉంటుంది



వర్కింగ్ అవర్స్, రెమ్యూనరేషన్ కారణంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఓ భారీ సినిమా నుంచి వైదొలగాల్సి వచ్చిందనే వార్తలు కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

8 గంటల కంటే ఎక్కువ వర్క్ చేయనని చెప్పడంతో పాటూ రూ.25 కోట్ల పారితోషికం అడగడం వల్లే దీపికాను ఆ ప్రాజెక్టు నుంచి తప్పించారన్నారు. అయితే ఈ విషయంపై తాజాగా బాలీవుడ్ డైరెక్టర్ కబీర్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. చందూ ఛాంపియన్, భజరంగీ భాయిజాన్‌లాంటి సక్సెస్‌ఫుల్ సినిమా లను అందించిన కబీర్ ఖాన్ వర్కింగ్ అవర్స్ విషయంలో దీపికా డిమాండ్స్‌ను సమర్ధించడంతో పాటూ ఆమె అడిగిన విషయంలో తప్పేముందని తిరిగి ప్రశ్నించారు. సినీ ఇండస్ట్రీలో వర్క్ చేసే వారికి కూడా పర్సనల్ లైఫ్ ఉంటుందని, వారి హెల్త్ కూడా అందరి లాంటిదేనని, వారికి కూడా పర్సనల్ టైమ్ కావాలని, స్టార్ హీరోలైన ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్ కూడా రోజుకు 8 గంటలు మాత్రమే వర్క్ చేస్తారని, వారి విషయంలో తప్పు కానిది దీపికా విషయంలో అది ఎందుకు తప్పుగా మారిందో తనకు అర్థం కావడం లేదని కబీర్ ఖాన్ అన్నారు. ఒక సినిమాలో ఎవరినైనా రిజెక్ట్ చేస్తున్నప్పుడు డైరెక్టర్లకు స్ట్రాంగ్ రీజన్ ఉండాలని, మూవీ షూటింగ్స్ కోసం యాక్టర్లు వారి పర్సనల్ లైఫ్‌ను త్యాగం చేయాలనే వాదనతో తానెప్పుడూ ఏకీభవించనని, పర్సనల్‌గా తానెప్పుడూ 12 గంటలకు మించి షూటింగ్ చేసింది లేదని, ఇప్పటివరకు తన కెరీర్లో ఆదివారాల్లో షూటింగ్ చేసింది లేదని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా దీపికా రెమ్యూనరేషన్ గురించి కూడా ఆయన మాట్లాడారు. ఆదరణ ఉన్న ఎవరికైనా తమ రేంజ్ రెమ్యూనరేషన్ అడిగే హక్కు ఉందని, వ్యక్తులను చూసి కాకుండా వారికున్న స్టార్‌డమ్‌ను చూసి రెమ్యూనరేషన్‌ను ఇవ్వాలని ఆయన కోరారు. ప్రస్తుతం దీపికాకు సంబంధించి కబీర్ ఖాన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

# మామితాతో లవ్ స్టోరీ కావాలంటున్న ఫ్యాన్స్..!



ప్రేమలు సినిమాతో యూత్ ఆడియన్స్‌లో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది మలయాళ భామ మమితా బైజు. అంతకుమ్ముందు ఐదారేళ్లుగా సినిమాలు చేస్తున్నా కూడా ప్రేమలుతో అమ్మడి టాలెంట్ సౌత్ ఆడియన్స్‌కి నచ్చేసింది. యూత్ ఆడియన్స్ అయితే మమితా పేరు వింటే చాలు ఊగిపోతున్నారు. ప్రేమలు తెలుగులో కూడా మంచి ఫలితాన్ని అందుకుంది. ఐతే ప్రేమలు తర్వాత అమ్మడు కోలీవుడ్‌లో ఆల్రెడీ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే రెడు సినిమాలు చేసింది మరో రెండు సినిమాలు సైన్ చేసింది. తెలుగులో మైత్రి మేకర్స్ చేస్తున్న డ్యూడ్‌లో ప్రదీప్ రంగనాథ్‌తో జత కడుతుంది మమితా. ఐతే లేటెస్ట్‌గా సూర్య వెంకీ అట్లూరి సినిమాలో కూడా అమ్మడు అవకాశం దక్కించుకుంది. ఐతే మమితాకు యూత్‌లో ఉన్న ఫాలోయింగ్ తెలుసు కాబట్టి ఆమెను యూత్ ఫుల్ ఎంటర్టైనర్స్, లవ్ స్టోరీస్‌లో తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. మమితాతో వెరైటీ లవ్ స్టోరీస్ చేస్తే చూడాలని కోరుతున్నారు. అది కాకుండా ఆమె కమర్షియల్ సినిమాల్లో నటిస్తే అంతగా స్కోప్ దొరకదని వాళ్ల ఆలోచన. ఒక విధంగా అది నిజమే అని చెప్పొచ్చు. మమితా లాంటి టాలెంట్ క్యూట్ హీరోయిన్ తో డిఫరెంట్ డిఫరెంట్ లవ్ స్టోరీస్ చేస్తే బాగుంటుంది. అలా కాకుండా ఆమెకు స్టార్ సినిమాల్లో కేవలం పాటల వరకు వచ్చి వెళ్లే హీరోయిన్‌లా తీసుకుంటే మాత్రం తప్పకుండా రివర్స్‌లో రిజల్ట్ ఉంటుంది. మమితాను ఆడియన్స్ ఒక లవ్ స్టోరీ హీరోయిన్‌గా చూడాలని ఆసక్తిగా ఉన్నారు. అందుకే అలాంటి కథలకే ఆమెను తీసుకుంటే బెటర్ అంటున్నారు. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తే క్రేజ్ రాదా అంటే వస్తుంది కానీ అది సరైన పాత్ర పడినప్పుడు మాత్రమే అలా కుదురుతుంది. అలా కాకుండా కేవలం పాటల వరకే హీరోయిన్ అనేలా ఉంటే మాత్రం మైతా వల్ల సినిమాకు ప్లస్ అవ్వడం అటుంచితే మైనస్ అవుతుంది. ఈ విషయంలో మమితా కూడా ఆడియన్స్‌లో తనకున్న ఫాలోయింగ్ గుర్తించి సినిమాలు ఎంపిక చేసుకుంటే బెటర్ అని అంటున్నారు. సూర్యతో చేస్తున్న సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉంటుందో కానీ ప్రదీతో చేస్తున్న డ్యూడ్‌లో యూత్ ఆడియన్స్‌కి మరోసారి కిక్ ఇచ్చే రోల్ ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# 'కుబేర' ఆ మల్టీప్లెక్స్‌ల్లో విడుదల లేదు.. కారణం ఇదే!



తెలుగు, తమిళ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కుబేర' సినిమా విడుదలకు సిద్ధం అయింది. ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. టాలీవుడ్ సీనియర్ స్టార్ నాగార్జున కీలక పాత్రలో నటించగా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ధనుష్ బిచ్చగాడిగా కనిపించబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా ఉన్నాయి. ధనుష్ వంటి స్టార్ హీరో ఆ పాత్రకు ఒప్పుకోవడం అంటే మామూలు విషయం కాదు. కథ ఏ స్థాయిలో ఉంటుందో ఊహకు సైతం అందడం లేదు అంటూ సినీ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుతూ ఉన్నారు. సుదీర్ఘ వాయిదాల పర్వం తర్వాత విడుదలకు రెడీ అయిన కుబేర సినిమాను ఇంకా కూడా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ సినిమా పోస్ట్ థియేట్రికల్ రిలీజ్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ వీడియో తీసుకుంది. థియేట్రికల్ రిలీజ్ అయిన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతుంది. అయితే ఇదే సినిమాకు పెద్ద సమస్యను తెచ్చి పెట్టింది. ఈమధ్య కాలంలో నార్త్ ఇండియాలో ఓటీటీల ప్రభావం తగ్గించడం కోసం కొన్ని మల్టీప్లెక్స్‌లు నింబధన తీసుకు వచ్చాయి. ఆ నిబంధన ప్రకారం థియేట్రికల్ రిలీజ్ అయిన ఎనిమిది వారాల తర్వాత మాత్రమే ఓటీటీ స్ట్రీమింగ్‌కి అనుమతించాలి. ఈ నిబంధన కారణంగా కుబేర సినిమా ఆయా మల్టీప్లెక్స్‌లో విడుదల కావడం లేదు. ధనుష్‌కి నార్త్ ఇండియాలో ఉన్న మార్కెట్, క్రేజ్ నేపథ్యంలో కుబేర సినిమాను అక్కడ పెద్ద ఎత్తున విడుదల చేయాలని భావించారు. కానీ అది సాధ్యం కావడం లేదు. పీవీఆర్, ఐనాక్స్, సినీపోలీస్ వంటి మల్టీప్లెక్స్‌లు 8 వారాల ఓటీటీ గడువు ఉంటేనే స్క్రీనింగ్‌కు ఒప్పుకుంటున్నాయి. కుబేర హిందీ వర్షన్‌ను సింగిల్ స్క్రీన్స్‌లో మాత్రమే ప్రేక్షకులు చూసే వీలు ఉంటుంది. ఆ మూడు మల్టీప్లెక్స్‌ల్లో విడుదల చేయాలంటే ఏ సినిమా అయినా ఓటీటీ స్ట్రీమింగ్ 8 వారాల తర్వాత చేస్తామని ముందుగానే ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ కుబేర నిర్మాతలు నాలుగు వారాలకే స్ట్రీమింగ్ చేసుకోవచ్చు అంటే అమెజాన్‌కి ఒప్పందం ఇచ్చింది. రష్మిక మందన్నతో పాటు అనుపమ్ ఖేర్ నటించిన ఈ సినిమాకు హిందీ మార్కెట్‌లో మంచి బజ్ ఉంది. కానీ మల్టీప్లెక్స్‌లో సినిమాను విడుదల చేసేందుకు వీలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. సౌత్‌లో ముఖ్యంగా తెలుగు, తమిళ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఇలాంటి సమయంలో హిందీలో కూడా అత్యధిక స్క్రీన్స్‌లో రిలీజ్ అయితే భారీ ఓపెనింగ్స్ దక్కే అవకాశం ఉంది. కానీ 8 వారాల నిబంధన కారణంగా అక్కడ ఎక్కువగా విడుదల చేయలేక పోతున్నారు. ఇది ఖచ్చితంగా నిర్మాతలకు నష్టంను మిగిల్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలి : జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడు









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించిన మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె లావణ్య సహకారంతో శుక్రవారం అనకాపల్లి పట్టణం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో 800 మంది విద్యార్థులతో విద్యార్థుల థీమ్ యోగాంధ్ర –2025 కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహించారు. ముందుగా జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా ఆయుష్ శాఖ అధికారి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థుల థీమ్ యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ యోగా ప్రదర్శనలో యోగ గురువు దొరమ్మ నాయుడు, బి అప్పారావులు ఈ కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగా దినోత్సవ ప్రోటోకాల్ అనుసరించి ఆ కార్యక్రమాలు అన్నీ కూడా నిర్వహించడం అలాగే విద్యార్థులతో యోగా శిక్షణ చేయించడం జరిగింది మరియు యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ కూడా చేసి చూపించి విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరితో చేయించడం జరిగింది. జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి యోగా చేయడంతో చక్కనైనటువంటి ఆరోగ్యం మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలియజేశారు.

రోజు యోగా చెయ్యడం ద్వారా విద్యార్థులు మానసిక శారీరక ఆరోగ్యం అనేది చాలా బలంగా ఉంటుందన్నారు. జిల్లా ఆయుష్మాన్ అధికారిని డాక్టర్ కె లావణ్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేసినట్లయితే అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతార న్నారు. రాబోయే జూన్ 21 వ తారీఖున విశాఖపట్నంలో జరగ బోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంకి అందరూ సమాయత్తం కావాలని ప్రతి ఒక్కరితో యోగా యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి అప్పారావు, అనకాపల్లి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కె.ఎం.నాయుడు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పి.కమల, డి వి.ఎస్. కె నాయుడు, తదితర వ్యాయామ ఉపాధ్యాయ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# గొల్లపూడి బీసీ భవన్ కార్యాలయంలో బోర్డు మీటింగ్ సమావేశం










**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ గొల్లపూడి బీసీ భవన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ బోర్డు మీటింగ్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమా వేశంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ "మళ్ళ సురేంద్ర", రాష్ట్ర బీసీ కమిషన్ ఈడి "ఉమాదేవి", ఆఫీసర్ "రఘు" ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో గవర జాతీయులు ఎక్కువ ఉన్న ప్రాంతంలో గౌరీ కళ్యాణ మండపం నిర్మించాల్సిందిగా అధికారులను కోరారు.

అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా చేస్తున్న పథకాలు పెన్షన్లు అలాగే బీసీ కార్పొరేషన్ లోన్స్ మళ్ళీ ఆదరణ 2, వీలైన అంత తొందరగా అధికారులతో మాట్లాడి లబ్ధిదారులు ఎంపిక చేసి వాటిని అందజేసే విధంగా కృషి చేయాలని అధికారులను కోరారు. తదుపరి విలేకరుల సమావేశంలో మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్న సందర్భంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణదల పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎన్నికల ముందు వాగ్దానంలో భాగంగా మొట్టమొదటి నెల నుంచి కూడా పెన్షన్స్ 4000, 6000, 15000 రూపాయలు సూర్యోదయం అవ్వక ముందే సచివాలయం ఉద్యోగస్తులతో, కూటమి పార్టీ నాయకులతో నేరుగా ఇంటికెళ్లి ప్రజలకు అందజేస్తున్నారని, రాష్ట్ర మొత్తంలో అన్ని నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లన్నీ నూతనంగా వేస్తున్నారని వైసిపి ప్రభుత్వంలో మూసివేసిన అన్నా క్యాంటీన్ అన్నిటిని రాష్ట్రవ్యాప్తంగా తెరిచి పేదవాళ్లకు కడుపునిండా తినే విధంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించారని, అలాగే రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ మళ్లీ ఇవ్వడం జరిగిందని దీపం పథకం 2 కింద ఆంధ్రప్రదేశ్లో ప్రతి ఇంటికి కూడా అర్హులైన వారందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేయడం జరిగిందని, ఇప్పుడు తల్లికి వందనం పేరుతో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి పిల్లలకు కూడా అర్హులైన తల్లిదండ్రులు అకౌంట్లో వారందరికీ 15000 రూపాయలు అందుచేతనందుకు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.

గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వాగ్దానం కూడా సరిగ్గా నిర్వహించలేదని, కూటమి ప్రభుత్వం ఏడాదయిన సందర్భంలో చెప్పిన విధంగా వాగ్దానాలు నెరవేర్చుకుంటూ వస్తున్నారని, ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అమరావతి పనులు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు అమరావతి వచ్చి మళ్లీ అమరావతి పనులు ప్రారంభించారని పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.

ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలు అన్నీ కూడా తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ విద్య వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని మొన్న టెన్త్ క్లాసులో, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపించిన విద్యార్థి, విద్యా ర్థులకు షైనింగ్ స్టార్స్ పేరుతో మంచి ప్రతిభ అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని మళ్ళ సురేంద్ర తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర గవర డైరెక్టర్లు వేగి పరమేష్, పొలమరశెట్టి నాగేశ్వరరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, మళ్ళ గణేష్, ఆళ్ల మంగరాజు, విల్లూరి హరి, మళ్ళ రవికుమార్, బొడ్డేడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ శివశక్తి క్షేత్రాన్ని దర్శించుకున్న ప్రముఖ పాటల రచయిత జెకె భారవి





**నాతవరం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం చిక్కుడుపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ శివశక్తి క్షేత్రాన్ని దర్శించుకున్న ప్రముఖ గేయ, మాట, పాటల రచయిత జెకె భారవి. (అన్నమయ్య శ్రీరామదాసు, మంజునాథ్, ఆదిశంకరాచార్యులు, నమో వెంకటేశా మొదలగు సినిమాల రచయిత) వారికి స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించిన ఆలయ ధర్మకర్త కేఎస్ఎన్ శర్మ, గౌరవ ధర్మకర్త పోలుపర్తి శ్రీనివాసరావు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాలయం చాలా అద్భుతంగా ఉందని కొనియాడారు అతిపెద్ద శివాలయంగా పేరందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత శర్మ, ఆలయ ధర్మకర్త పోలుపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# డి సి సి బి చైర్మన్ కోన తాతారావు జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన 85 వార్డు టిడిపి జనసేన నాయకులు



**గాజువాక, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు జన్మదిన సందర్భంగా ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ 85 వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు గవర సోమశేఖర్, టిడిపి నాయకులు కొర్రయి జగదీష్, బండారు చందు రమేష్, పలక అచ్యుత్, విందుల నాగేంద్ర, ఎం శివ జనసేన పార్టీ నాయకులు పట్టా పైడి రత్నం, గుర్రం గోవిందా, పామల వసంతరావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోన తాతారావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైఎస్ఆర్సిపి పాలనల్లో ఆంధ్ర రాష్ట్రాన్ని దుష్ట పాలన చేసి ప్రజల్ని ఎన్నో ఇబ్బందులు పెట్టారని అటువంటిదే కూటమి పాలనల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాది కాలములో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం ప్రగతి సాధించడం జరిగిందని కూటమి ప్రభుత్వములో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ప్రజలకి తెలియజేయాలని ఏడాది పాలన అయిన సందర్భంగా కూటమి కార్యకర్తలకు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థులకు విద్యా మిత్ర పుస్తకాలు పంపిణీ



**నాతవరం, (రాజధాని వార్తలు):** నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యా మిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కాపరపు అప్పలనర్స, మాజీ ఎంపీటీసీ అప్పిరెడ్డి మాణిక్యం మాజీ ఎంపీపీ నేతలు విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు కోండ్రపు సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ నవత మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ పోలుపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# విమాన ప్రమాదం ఊహించనది

## - పొన్నాడ రవి కుమార్

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** విమాన ప్రమాదం, ఊహించనదని, శ్రీకాకుళం ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం జోన్ చైర్మన్ పొన్నాడ.రవి కుమార్ శ్రీకాకుళం ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ కార్యక్రమంలో అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం, మనసుని, కలచివేసిందని, ఈ అనుకోని ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు. శ్రీకాకుళం ఎయిర్ ట్రావెల్ అసోసియేషన్ తరపున బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ ప్రమాద ఘటన స్థలానికి రక్షణ బృందాలు వైద్య సహాయం అందించారని, దేశంలో ప్రముఖుల సైతం ప్రమాద ఘటనపై స్పందించారన్నారు. కేంద్ర విమానయానా శాఖా మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా వెంటనే స్పందించి, ఘటనా స్థలానికి చేరుకొని, సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేసారన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan